# అపోజిషన్

ప్రభాకర్ బాలు

రాజారాం స్వతహాగా మంచివాడు, అభ్యుదయ భావాలు వున్నవాడు. కాని అతనికో దురలవాటు వుంది.

ఎదుటివాడు చెప్పే విషయాన్ని—అది ప్రగతిశీలకమైనదయినా, శాస్త్రీయమైనదయినాసరే ముక్తకంఠంతో ఖండించడం!

"వరకట్నం దురాచారం. దానివల్ల ఎంతోమంది అమాయకుల జీవితాలు నాశనమై పోతున్నాయి" అంటే—

"లేదు వరకట్నం దురాచారం కాదు. స్త్రీలకు ఆస్థిహక్కు బదులుగా ఏర్పరచిన ఓ సదుపాయం" అంటూ వాదనకు దిగుతాడు.

ఎవరయినా కులమతాలని ఖండిస్తే—

రాజారాం సమర్థిస్తాడు!

దేవుడు లేడనే వాడితో—

దేవుడున్నాడని ఆర్గ్యూ చేస్తాడు!!

దేవుడున్నాడని నమ్మేవారితో—

దేవుడు లేడని వాదిస్తాడు!!!

అతని దొక విచిత్రమైన మనస్తత్వం.

అతని కమిట్‌మెంట్ తెలిసిన సన్నిహిత మిత్రులు "ఇదేమిటి! నువ్వు ఇట్లా మాట్లాడట మేమిటి?" అని ఆశ్చర్యపోతే

మెల్లిగా చెబుతాడు "సరదా కోసం" అని. "దేనికయినా అపోజిషన్ వుండాలి. అప్పుడే మజా వొస్తుంది" అంటాడు.

రాజారాం ఎవరితోనయినా అలా వాదించేప్పుడు తను సరదాకి అలా వాదిస్తున్నాననే భావం ఏమాత్రం మొహంలో ప్రతిబింబించదు. చాలా సీరియస్‌గా వుంటాడు. దాంతో ఎదటివాడు మరింత రెచ్చిపోయేవాడు. అతని ఈ అలవాటువల్ల రాజారాం అంటే నెంబర్ వన్ రోగ్ అని దూరమైపోయిన వాళ్లు కూడా వున్నారు. అయినా అతని అలవాటు మాత్రం మారలేదు.

ఆ రోజు—

ఊళ్ళో "మా భూమి" మార్నింగ్ షో ఆడుతోంది.

రాజారాంకి అటువంటి చిత్రాలంటే చచ్చేంత ఇష్టం. కిషన్ చందర్ రాసిన "జబ్ ఖేత్ జాగే" అనే ఉర్దూ నవల ఆధారంగా తీసిన చిత్రం అది. నైజాం నవాబు కిరాతక పాలనలో—భూస్వామ్య వ్యవస్థ ఉక్కు పాదాల క్రింద తెలంగాణా ప్రజలు పడ్డ పాట్లు - వాళ్ల వీరోచితంగా చేసిన పోరాటం ఆ చిత్రకథా వస్తువు.

హాలంతా ప్రేక్షకులతో కిటకిటలాడుతోంది.

ఆ సినిమాలోని కొన్ని సంఘటనలు ప్రేక్షకుల కంట తడి పెట్టించేయి....వాళ్ళచేత చప్పట్లు చరిపించేయి—వాళ్ళ పిడికిళ్లు బిగుసుకునేలా చేసేయి.

రాజారాంని కూడా ఆ సినిమా ఎంతో కదిలించింది.

అప్పుడు సినిమాలోని పాత్రలతోపాటు ప్రేక్షకులు కొందరు "ఇంక్విలాబ్—జిందాబాద్" అంటూ ఆవేశపూరితంగా నినాదాలు చేయసాగేరు థియేటర్‌లోనే.

ఉన్నట్టుండి రాజారాం మెదడులోని 'అపోజిషన్' పురుగు తొలవడం మొదలు పెట్టింది.

"ఇంక్విలాబ్ జిందాబాద్."

"జిందాబాద్"—ప్రేక్షకులు.

కాస్త సద్దు మణిగిన వెంటనే రాజారాం అరిచాడు.

"ముర్దాబాద్."

థియేటర్‌లో కల కలం చెలరేగింది!

"ఎవ్వడ్రా అది?" అంటూ ముందు కూర్చున్న ప్రేక్షకులు వెనక్కి చూపులు సారించేరు.

రాజారాంకి పట్టలేనంత సంతోషం వేసింది తన మాటకి వచ్చిన రెస్పాన్స్ చూసి.

మళ్ళీ ఓసారి—

"ఇంక్విలాబ్......."

"ముర్దాబాద్" అన్నాడు.

"అంతే!"

హఠాత్తుగా ముగ్గురు నలుగురు యువకులు విసురుగా లేచి వచ్చి రాజారాం కాలర్ పట్టుకుని లేపి ఫెడేల్ ఫెడేల్‌మని నాలుగు తగిలించారు.

"తన్నండి....కొట్టండి" హాలంతా అరుపులు కేకలు........గందరగోళంగా తయారయింది.

ఈ సంఘటనతో రాజారాం దిమ్మ తిరిగిపోయింది.

ఇపుడు రాజారాం.........

దేవుడు వున్నాడు అనే వాడితో—

ఉన్నాడు ఉన్నాడు అంటున్నాడు!

దేవుడు లేడు అనేవాడితో—

అవును దేవుడు లేడు అసలే లేడు అంటున్నాడు!! □